ప్రజాశక్తి
శనివారం 30 సెప్టెంబర్ 2023
5
శ్రీ సత్యసాయి

మెగా చెక్కు విడుదల చేస్తున్న కలెక్టర్, తదితరులు

'అనంత' కరువుపైనా స్వామినాథన్ అధ్యయనం

సమస్యల అధ్యయనమే కాదు.. పరిష్కార మార్గాలూ సూచన

పట్టించుకోని పాలకులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

హరిత విప్లవ పితామహుడుగా పిలువబడే వ్యవసాయ శాస్త్రవేత్త స్వామినాథన్‌కు అనంతపురం జిల్లాతోనూ అనుబంధం ఉంది. రైతు ఆత్మహత్యలపై అధ్యయనం చేసే సమయంలోనే కాకుండా జిల్లాలో నెలకొన్న కరువు, ప్రత్యేక పరిస్థితులను అధ్యయనం చేసే విషయంలోనూ ఆయన పాత్ర ఉండటం గమనార్హం. డాక్టర్ స్వామినాథన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లాలోని వ్యవసాయ పరిస్థితులపై అధ్యయనం చేసి నివేదికను రూపొందించారు. ఆయన అధ్యక్షతన రుక్మణి, మంజుల 2009లో ఈ అధ్యయన నివేదికన రూపొందించారు. ఇందులో జిల్లాలోని భౌగోళిక పరిస్థితులు మొదలుకుని, వాతావరణం, నేల స్వభావం, సాగునీటి వనరులు ఇలా అన్నింటినీ అధ్యయనం చేశారు. దీంతోపాటు పూర్వం నుంచి జిల్లాలోని వ్యవసాయంతోపాటు, సాగు పద్దతుల్లో వచ్చిన మార్పులను క్షుణ్ణంగా అధ్యయనం చేశారు.

సమగ్రమైన అధ్యయనం

1961 నుంచి 2009 వరకు జిల్లాలో వ్యవసాయ రంగంలో వచ్చిన మార్పులన్నింటినీ ఆ నివేదికలో పొందిపరిచారు. 1961లో అత్యధికం ఆహార ధాన్యపు పంటలు సాగవుతుండేవని పేర్కొన్నారు. అప్పట్లో సుమారు చిరు, ఆహార ధాన్యాలన్ని కలిపి ఐదు లక్షల హెక్టార్ల వరకు పంటలు సాగవుతే ఉండేవి. ఆ సమయంలో వేరుశనగ కేవలం రెండు లక్షల హెక్టార్లలోపే ఉండేది. అయితే దేశంలో వచ్చిన మార్పులు, వాణిజ్య అవసరాల నేపథ్యంలో జిల్లాలోనూ వ్యవసాయ సాగులో నూనె గింజల సాగుపై రైతులు అత్యధికంగా మొగ్గు చూపడం కనిపించిందని ఆ నివేదికలో పేర్కొన్నారు. రెండు లక్షల హెక్టార్ల లోపు ఉన్న వేరుశనగ సాగు 2006 సమయానికి ఎనిమిది లక్షల హెక్టార్లకు చేరిందని పేర్కొన్నారు. అయితే మారిన పంటల సాగుకు అనుగుణంగా విత్తనాల్లో మార్పులు రాలేదు. ఎప్పుడో 1941 నాటి టిఎంవి-2 రకమే దశాబ్దాల పాటు సాగవుతూ వచ్చింది. కొత్త రకాలైన వంగడలు పెద్దగా రాలేదు. ఆ తరువాత జెఎల్ 24, కె-6లు వచ్చినట్టు తెలిపారు. ఈ విత్తనం కూడా ప్రభుత్వం సబ్సిడీపై ఇచ్చినప్పటికీ సరైన నాణ్యత లేక రైతులకు ఆశించిన దిగబడులు కూడా రాని పరిస్థితులు నెలకొన్నట్టు వివరించారు. వ్యవసాయ పద్దతులను ఇబ్బందులను అధ్యయనం చేస్తూనే కొన్ని సూచనలు సైతం చేశారు.

వారు చేసిన సూచనలు

నాణ్యతమైన విత్తనాలను రైతులకు అందుబాటులోకి తీసుకురావాలి. గ్రామ స్థాయిలోనే విత్తనోత్పత్తి జరగాలి. కొత్త వంగడాలను ఎప్పటికప్పుడు తీసుకొచ్చి దిగుబడులు పెరిగే విధంగా చూడాలి. సేంద్రీయ ఎరువుల వాడకం పెంచేందుకు పశుపోషణ అవసరమవుతుందని సూచించారు. జిల్లాలో పశు సంపద అందుకు అనుగుణంగానే ఉన్నట్టు పేర్కొన్నారు. అదే విధంగా గిడ్డంగులను స్థానికంగా పెంచాల్సిన అవసరముంది. మార్కెటింగు సౌకర్యం కల్పించడం, సాగునీటి వసతి పెంపొందించడం వంటి చర్యలు తీసుకోవాలని ఈ నివేదికలో సిఫారసులు చేశారు. ఇలా జిల్లాలోని కరువు పరిస్థితులు, వాటి పరిష్కారాలను స్వామినాథన్ ఫౌండేషన్ ద్వారా 2009లోనే చేశారు. అయితే పాలకులు వీటి అమలుపై దృష్టి సారించిన దాఖలాలు కనిపించడం లేదు. ఇప్పటికీ రైతులకు నాణ్యమైన విత్తనం అందుబాటులో లేదన్న విమర్శలున్నాయి. అదే విధంగా తక్కిన సిఫారసుల విషయంలోనూ వెనుకబాటు ఉన్నట్టు రైతు సంఘాల నాయకులు చెబుతున్నారు.

జిల్లాకు వాహన మిత్ర ద్వారా రూ. 5.66 కోట్లు లబ్ధి

కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

వాహనమిత్ర ద్వారా జిల్లా వ్యాప్తంగా 5666 మంది లబ్ధిదారులకు రూ. 5.66 కోట్లు వారి బ్యాంకు ఖాతాలలో నేరుగా జమ చేయడం జరిగిందని కలెక్టర్ అరుణ్ బాబు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి వాహన మిత్ర పథకం కింద బటన్ నొక్కి లబ్ధిదారులకు వారి ఖాతాలో నగదు జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ తో పాటు అగ్రి బోర్డు చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, కూడా చైర్‌పర్సన్ లక్ష్మీ నరసమ్మ, వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ నళిని, రాష్ట్ర కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్య ప్రకాష్ బాబు, జిల్లా రవాణా శాఖ అధికారి కరుణ సాగర్ రెడ్డి తదితరులు వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరుసుగా ఐదో ఏడాది వైఎస్ఆర్ వాహన మిత్ర పథకం ద్వారా ఆటో, టాక్సీ, క్యాబ్, మ్యాక్సీ, వాహన యజమానులు, డ్రైవర్లకు నిధులు అందాయన్నారు. ఆటోవాలాలకు ఆసరాగా ఈ పథకం ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఆటో, టాక్సీవాలాలకు భరోసాగా ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. బలహీనవర్గాల వారికి ఈ పథకం ద్వారా ఆర్థిక భరోసాను కల్పిస్తున్నట్లు చెప్పారు. అర్హులైన వారందరూ ప్రభుత్వ పథకాలపై అవగాహనతో వాటిని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. అనంతరం రూ. 5.66 కోట్లు మెగా చెక్కును అందజేశారు. ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్న పలువురు ఆటో డ్రైవర్లు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ కృష్ణారెడ్డి, డిసిహెచ్ఓ తిప్పేంద్ర నాయక్, కదిరి ఎంఇఐ వరప్రసాద్, హిందూపురం శివశంకర్, పెనుకొండ రవీంద్ర నాయక్, రాణి, ఆటో యూనియన్ అధ్యక్షులు భాస్కర్, ఆటో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు పరిశీలనపై దృష్టి పెట్టండి

పెనుకొండ : వీలైనంత ఎక్కువగా ఓటరు పరిశీలనపై దృష్టి సారించాలని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ పార్టీ శ్రేణులకు సూచించారు. ఆమె శుక్రవారం పట్టణంలోని తన కార్యాలయంలో మాట్లాడుతూ సిఎం జగన్, వైసిపి నాయకులు దొంగ ఓట్లు చేర్పించి మళ్లీ గెలవాలని కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. ప్రతి బూత్ పరిధిలో 40 నుండి 50 వరకు టిడిపి సానుభూతి పరుల ఓట్లను తొలగించేందుకు అధికారుల అండదండలతో వైసిపి నాయకులు కుట్ర పన్నుతున్నారని, కావున అప్రమత్తంగా ఉండి అడ్డుకోవాలని సూచించారు. చంద్రబాబు అరెస్ట్‌లో కుట్ర గురించి వీలైనంత ఎక్కువ మందికి అర్థమయ్యేలా వివరిస్తూ, సిఎం జగన్ అరాచకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మాధవనాయుడు, శ్రీరాములు, ప్రసాద్, త్రివేంద్ర పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిడబ్ల్యూసి మెంబర్ రఘువీరారెడ్డి

బిజెపి అండతోనే చంద్రబాబు అరెస్టు

సిడబ్ల్యూసి మెంబర్ రఘువీరా రెడ్డి

ప్రజాశక్తి మడకశిర

భారతీయ జనతా పార్టీ అండతోనే తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును వైసిపి ప్రభుత్వం అరెస్టు చేసిందని సిడబ్ల్యూసి మెంబర్, మాజీ మంత్రి రఘువీరా రెడ్డి ఆరోపించారు. శుక్రవారం సత్యసాయి జిల్లా మడకశిర నియోజకవర్గం నీలకంఠాపురంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు అరెస్టుకు బీజేపీనే కారణమన్నారు.ఆంధ్రప్రదేశ్‌లో బిజెపి బలపడటానికి ఇలాంటి చర్యలకు పాల్పడుతోందన్నారు. అందులో భాగంగా వైసిపి ప్రభుత్వ భుజంపై తుపాకీ పెట్టి టిడిపికి గురిపెట్టిందని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో బిజెపి బలోపేతం చేయడానికి పురంధరేశ్వరిని బిజెపి అధ్యక్షురాలిగా నియమించారని అన్నారు. . భారతీయ జనతా పార్టీ అనే అనకొండ కోరల్లో చంద్రబాబు బలంగా ఇరుక్కొన్నారన్నారు. ప్రధానమంత్రికి, హోంమంత్రికి తెలియకుండా చంద్రబాబు అరెస్టు జరగలేదని అన్నారు. చంద్రబాబు అరెస్టు తరువాత టిడిపి అన్ని పార్టీలను కలిసిందని కాంగ్రెస్ పార్టీని మాత్రం కలవలేదని అన్నారు. భవిష్యత్తులో టిడిపి, వైసిపికి కూడా రాష్ట్రంలో మనుగడ లేకుండా చేయడానికి కుట్ర పన్నిందని ఆరోపించారుఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సుధాకర్, మందలపల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల కష్టార్జితాన్ని కాజేసిన పుట్టపర్తి ఎమ్మెల్యే

సిఐటియు పట్టణ కార్యదర్శి నరసింహప్ప

ప్రజాశక్తి-హిందూపురం

దీక్షల్లో మాట్లాడుతున్న నరసింహప్ప

పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి తన బినామి గోవర్ధన్ రెడ్డిని అడ్డుపెట్టుకుని కార్మికుల కష్టార్జితాన్ని కాజేశారని సిఐటియు పట్టణ కార్యదర్శి నరసింహప్ప విమర్శించారు. కార్మికులకు న్యాయం చేయాలని, వేతనాల్లో కోత విధించిన డబ్బులను తిరిగి చెల్లించాలని డిమాండ్ చేస్తు గ్రామీణ నీటి పారుదల శాఖ డిఇ కార్యాలయం ముందు కార్మికులు చేపట్టిన నిరవధిక దీక్షలు శుక్రవారానికి 32వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలకు సిఐటియు నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ కార్యదర్శి నరసింహప్ప మాట్లాడుతు హిందూపురం డివిజన్‌లో నీలకంఠపురం శ్రీరామి రెడ్డి విభాగంలో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు గత 18 నెలల పిఎఫ్ బకాయిలు చెల్లించ లేదన్నారు. కార్మికులకు నెలకు వేతనం రూ.18వేలు ఇవ్వాల్సుంటే ఇందులో రూ.2500 కోత విధించి ఇస్తున్నారన్నారు. మిగిలిన వేతన డబ్బులు పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి ఎఎస్ఆర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ సంస్థ జినామి గోవర్ధన్ రెడ్డి అడ్డుపెట్టుకుని అడ్డంగా కార్మికుల సొమ్మును కాజేశారని విమర్శించారు. దీంతో పాటు పిఎఫ్ ఖాతాకు నిధులను జమ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. గుత్తేదారులపై చర్యలు తీసుకుని కార్మికులకు న్యాయం చేయాలని ఆందోళన కార్యక్రమాలు చేస్తున్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైన అధికారులు కార్మికులకు న్యాయం చేసి, గుత్తేదారుడిపై చర్యలు తీసుకోక పోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నీలకంఠాపురం శ్రీరామి రెడ్డి వాటర్ వర్కర్స్ యూనియన్ నాయకులు సోమశేఖర్, నాగేంద్ర, బాలకృష్ణ, మురళి, నారాయణప్ప, గిరీష్ తదితరులతో పాటు కార్మికులు పాల్గొన్నారు.

ఇళ్లపట్టాలిచ్చేదాకా పోరాటం

7 వ రోజు కొనసాగిన ఆందోళన

ప్రజాశక్తి - చిలమత్తూరు

సమావేశంలో మాట్లాడుతున్న పైపల్లి గంగాధర్, ప్రవీణ్ కుమార్

ప్రభుత్వం పేదలకు ఇళ్లస్థలాలు ఇచ్చే దాకా పోరాటం కొనసాగిస్తామని సిపిఎం నాయకులు, నిరుపేదలు అన్నారు. ఇళ్ల స్థలాల కోసం పేదలు సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన భూ స్వాధీన పోరాట యాత్ర శుక్రవారానికి 7 వ రోజుకు చేరుకుంది. కోడూరు లే అవుట్‌లో సుమారు 150 మంది లబ్ధిదారులతో పాటు ఇళ్లు లేని పేదలు దాదాపు 300 మందికి పైగా గుడిసెలు వేసుకొని భూస్వాధీన పోరాటాన్ని కొనసాగిస్తున్నారు. శుక్రవారం నిర్వహించిన పోరాటానికి సిపిఎం జిల్లా నాయకులు పైపల్లి గంగాధర్ మద్దతు తెలుపుతూ ఆందోళనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పప్పులు పెట్టి పోరు మాన్పే పద్దతుల్లో వ్యవహరిస్తోందని ఎద్దేవా చేశారు. అందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తామని గొప్పలు చెప్పుకోవడానికి వివాదాస్పద ప్రదేశాల్లో స్థలాలు ఇచ్చి షో చేశారని విమర్శించారు. పేరుకే లబ్దిదారులు గాని వారికి స్థలం ఇచ్చి ఇల్లు కట్టించిన పాపాన పోలేదని అన్నారు. అర్హత ఉంటే చాలు అన్నీ అందుతాయన్న పాలకుల మాటలు నీటిమూటలు అయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వందల సంఖ్యలో అర్హత ఉన్న పేదలు ఇంటి స్థలాల కోసం వస్తుండం చూస్తుంటే అర్హులను గుర్తించడంలో ప్రభుత్వ పారదర్శకత ఎలా ఉందో అర్థం అవుతుందని అన్నారు. పేదలకు వెంటనే పట్టాలు ఇచ్చి ఇంటి నిర్మాణాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. స్థానిక తహశీల్దార్ నాగరాజు ఇటు ప్రభుత్వాన్ని అటు పేదప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. ఐదు రోజుల్లో ఇళ్ల పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చి 15 రోజులు అవుతున్న పట్టించుకోలేదని ఇది మరింత పేదల్లో మరింత కోపాన్ని ప్రేరేపించిందని అన్నారు. ఇళ్ల స్థలాలు ఇచ్చే వరుకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యకాసం జిల్లా అధ్యక్షులు ఫిరంగి ప్రవీణ్ కుమార్, రహంతుల్లా, శివకుమార్, మణిస్వామి, హనీఫ్, రియాజ్, ఆనంద్, చరణ్, ఇర్షాద్, అంజి తదితరులు పాల్గొన్నారు.

కేసుల పురోగతిలో నిర్లక్ష్యం తగదు : ఎస్పీ

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

జూమ్ మీటింగ్‌లో ఎస్పీ, తదితరులు

ముఖ్యమైన కేసులలో పురోగతి సాధించి నిందితులకు కఠిన శిక్షలు పడేవిధంగా విచారణ త్వరితగతిన పూర్తిచేయాలని జిల్లా ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా పోలీసులతో నెలవారి నేర సమీక్షను జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. రాబోవు ఎన్నికల దృష్ట్యా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని, దర్యాప్తులో ఉన్న సాధారణ, తీవ్రమైన కేసులు, ప్రాపర్టీ కేసులు, పోక్సో యాక్ట్ కేసులు, గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులు, గంజాయి కేసులు, మిస్సింగ్ కేసులు తదితర వాటిపై దర్యాప్తు తీరును సంబంధిత పోలీసు అధికారులతో ఆరా తీశారు. కేసులు పెండింగులో ఉండడానికి గల కారణాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ లో ఉన్న కేసులను త్వరితగతిన దర్యాప్తు చేయాలని, క్రిమినల్ తదితర కేసులపై ఇన్వెస్టిగేషన్ వేగవంతం చేయాలని సూచించారు. ముఖ్యమైన కేసులు, రౌడీ షీటర్లు, కబ్జా నేరాలకు పాల్పడిన కేసులు, గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్న కేసులతో పాటు ఇతర ముఖ్యమైన కేసుల గురించి అధికారులు ప్రతిరోజు సమీక్షించి దర్యాప్తు త్వరితగతిన పూర్తి చేసి, కోర్టులో నేరాభియోగపత్రం సమర్పించాలన్నారు. సాక్షులను సమయానికి హాజరు పరుస్తూ కేసుల విచారణ సమయంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో సమన్వయం చేసుకొని నిర్ణీత సమయంలో నిందితులకు కఠిన శిక్షలు పడే విధంగా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఎస్పీ ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు నేషనల్ హైవే, స్టేట్ హైవేల్లో హైవే మొబైల్స్ ద్వారా ట్రాఫిక్ క్రమబద్ధీకరించడంతోపాటు రోడ్డు ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు చేపట్టాలన్నారు. సైబర్ క్రైమ్స్ వలన జరిగే నేరాలు పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పాత నేరస్తుల కదలికలపై నిఘా పెట్టి, నేరాల నియంత్రణకు పోలీసు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎస్పీ ఆదేశించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాన్ని పాటించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ విష్ణు, డిసిఆర్‌బి సిఐ సుబ్బారావు, లీగల్ అడ్వైజర్ సాయినాథ్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు : జెసి కార్తీక్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి జిల్లాలో రహదారుల ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్ కార్తీక్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జెసి, ఎఎస్పీ విష్ణు, జిల్లా రవాణా శాఖ అధికారి కరుణసాగర్‌రెడ్డి ఆధ్వర్యంలో రవాణా, పోలీస్, మెడికల్, మున్సిపల్, ఆర్‌అండ్‌బి, పంచాయతీరాజ్, జాతీయ రహదారుల అధికారులతో జిల్లా స్థాయి రహదారుల భద్రతా సమావేశం నిర్వహించారు. జెసి ఆరు మాసాలుగా రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకున్న చర్యలు, సాధించిన ప్రగతిపై సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. జెసి మాట్లాడుతూ భద్రతా లోపాలు, ప్రాంతాలను గుర్తించి ప్రమాదాల నివారణ చర్యలపై సమగ్ర ప్రణాళిక తయారు చేయాలన్నారు. రహదారుల మరమ్మతులు చేపట్టాలన్నారు. జాతీయ రహదారులపై నిరంతరం అంబులెన్స్, క్రేన్ అందుబాటులో ఉండేలా ఎన్‌హెచ్ అధికారులు సిద్ధం చేయాలన్నా రు. బ్లాక్ స్పాట్స్ గుర్తించడానికి పోలీసు, ఇంజినీరింగ్, రవాణా శాఖ అధికారులు ఒక టీంగా ఏర్పడి గుర్తించాల న్నారు. ప్రమాద బాధితులను సకాలంలో ఆసుపత్రికి తరలించిన వారికి ప్రోత్సాహకంగా రూ. 5వేలు అందిస్తామ ని, ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించి బాధితులకు అండగా నిలవాలని కోరారు. గత 9 నెలల్లో మొత్తం 357 ప్రమాదాలు జరగ్గా 100 మంది మృతి చెందారని 257 మంది గాయపడినట్లు నివేదిక ద్వారా తెలిసిందన్నారు. రోడ్లను ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అతివేగం, హెల్మెట్ ధరించకపోవడం, సీటు బెల్ట్ పెట్టుకోకపోవడంతో పాటు రహదారి నిబంధనలు పాటించకపోవడం ప్రమాదాలకు కారణమని తెలిపారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఓ డాక్టర్ ఎస్‌వి కృష్ణారెడ్డి, ఎంవిఐలు వరప్రసాద్, శివశంకర్, రాణి, ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారి మధుసూదన్, పిఆర్ ఎస్ఇ గోపాల్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి జెసి కార్తీక్

పెనుకొండలో ఇళ్ల స్థలాల సమస్యపై సిపిఎం రాష్ట్ర కార్యదర్శికి వినతి

ప్రజాశక్తి -పెనుకొండ

సిపిఎం రాష్ట్ర కార్యదర్శితో పెనుకొండవాసులు

విజయవాడ లో నిర్వహించిన దళిత రక్షణ మహా ధర్నా లో పాల్గొన్న పెనుకొండ ఇళ్ల స్థలాల సాధన పోరాట సంఘం నాయకులు దళిత, నిరుపేదలు తమ సమస్యను సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావుకు విన్నవించారు. మహా ధర్నా అనంతరం ఇళ్ల స్థలాల సాధన పోరాట కమిటీ సభ్యులు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి . శ్రీనివాస్ రావును, వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి . వెంకట్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకొని కనీస సౌకర్యాలు లేకుండా ఉన్నామని, స్థానిక అధికారులు పట్టించుకోవడం లేదని సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూడాలని కోరారు. దీంతో నాయకులు మాట్లాడుతూ పేదల పోరాటానికి ప్రత్యక్షంగా అన్ని రకాల మద్దతు ఉంటుందని స్థలాలు సాధించుకొనేంతవరకు కలిసి పోరాడుదామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, జిల్లా కమిటీ సభ్యులు నారాయణ, ఇళ్ల స్థలాల సాధన పోరాట కమిటీ సభ్యులు జయంతి, షాహినా, షబానా, రామాంజనమ్మ, శ్రీనివాసులు, నరసమ్మ, గీత, మంజుల, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ నాయకులకు ముందస్తు నోటీసులు

ప్రజాశక్తి-హిందూపురం

విద్యార్థి నాయకుడికి నోటీసు అందజేస్తున్న పోలీసు

విద్యార్థుల సమస్యలపై భారత విద్యార్థి సమాఖ్య(ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో చేపట్టిన 'చలో విజయవాడ'కు వెళ్లకుండా పోలీసులు హిందూపురం, పెనుగొండ, మడకశిర, కదిరి నియోజకవర్గాల్లో ఎస్ఎఫ్ఐ నాయకులకు ముందస్తు అరెస్టు నోటీసులు ఇచ్చారు. ఎన్ని అరెస్టులు చేసినా విజయవాడలో కార్యక్రమం చేపట్టి తీరుతామని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను విస్మరించిందన్నారు. విద్యాదీవెన, వసతి దీవెన, అమ్మఒడి పథకాల్లో కోతలపై సమాధానం చెప్పాలన్నారు. ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించకపోవడం, మధ్యాహ్న భోజన పథకాన్ని నిలిపివేయడం సిగ్గుచేటన్నారు. డిగ్రీ విద్యలో ప్రవేశాలు తగ్గడానికి ప్రభుత్వ విధానాలే కారణమన్నారు.

న్యాయవాదులు విధుల బహిష్కరణ

కదిరి అర్బన్ : ఆర్‌డిఓ పరిధిలోని రెవెన్యూ అప్పీల్ కేసులను జిల్లా రెవెన్యూ అధికారికి మారుస్తూ రెవెన్యూ ఉన్నత అధికారులు ఆదేశాలు జారీ చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం కదిరి న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో కోర్టు విధులను బహిష్కరించారు. న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షుడు షేక్ మహమ్మద్ ఫైజుల్లా అధ్యక్షతన బార్ అసోసియేషన్ కార్యాలయంలో సమావేశమై రెవెన్యూ ఉన్నతాధికారుల నిర్ణయాన్ని వ్యతిరేకించారు. కదిరి నుంచి పుట్టపర్తికి మార్చడం వల్ల కక్షిదారులకు ఇబ్బందులు వస్తాయన్నారు. సీనియర్ న్యాయవాది చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రెవెన్యూ కేసులు కదిరి ఆర్‌డిఓ పరిధి నుంచి పుట్టపర్తి డిఆర్‌ఓకు మార్చడానికి రెవిన్యూ ఉన్నతాధికారులకు ఎటువంటి అధికారం లేదని ఇది చట్ట విరుద్ధమన్నారు. సమావేశంలో ప్రభాకర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, జైనులాబుద్దీన్, రవీంద్రబాబు, చౌడప్ప, వెంకటేష్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు

ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలో ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు కదిరి గేట్ వద్ద ఆర్‌ఓబి(రైల్వే ఓవర్ బ్రిడ్జి) నిర్మించేం దుకు చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తెలిపారు. పట్టణంలోని 4వ వార్డులో శుక్రవారం నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నాడు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్‌ఓబి ఏర్పాటులో భాగంగా ఇళ్లు కోల్పోయే వారికి నష్ట పరిహారంతో పాటు ఇంటి పట్టాలు ఇస్తామన్నారు. అంతకుముందు 4వ వార్డులో స్థానికులు విద్యుత్ సమస్య ఉందని తెలపడంతో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ ప్రాథమికోన్నత పాఠశాలలో నాడు-నేడు పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సంక్షేమ పథకాల అమలులో వార్డు వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది పారదర్శకంగా పని చేయాలని ఎక్కడైనా చిన్నపాటి అవినీతి ఆరోపణ వస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ వైస్ ఛైర్మన్ వేముల జయరామిరెడ్డి, ట్రాన్స్‌కో, హౌసింగ్ ఏఇలు కొండారెడ్డి, బాలాజీ, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శీన, మున్సిపల్ డిఒ వన్నూరుస్వామి, కౌన్సిలర్లు జెసిబి రమణ, బ్రహ్మయ్య, నీలూరి వెంకటరాముడు, శంకరతేజ, గజ్జల శివ, నాయకులు కాచర్ల అంజి, గడ్డం రంగ, ఎస్పీ బాషా, కత్తే పెద్దన్న, ఖాదర్‌వలి, బైముతక రమణ, కేశగాళ్ల క్రిష్ణ, జెన్నే చందు, తదితరులు ఉన్నారు.

స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

3న పాలిసెట్ స్పాట్ అడ్మిషన్లు

హిందూపురం : స్థానిక మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఈసిఈ, సివిల్ ఇంజినీరింగ్ విభాగాల్లో మిగిలిన సీట్లను భర్తీ చేయడానికి అక్టోబర్ 3వ తేదీ స్పాట్ అడ్మిన్ ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ హరీష్‌బాబు తెలిపారు. ఆయన మాట్లాడుతూ పాలిసెట్ ఎంట్రన్స్ రాసినా, రాయక పోయినా, ర్యాంకు రాకపోయినా సీటు పొందవచ్చన్నారు. ఒరిజినల్ ధ్రువీకరణ ప్రతాలు, మూడు సెట్ల జిరాక్స్‌లతో పాటు ప్రాసెసింగ్ ఫీజ్ రూ. 1,100, కోర్స్ ఫీజ్ రూ. 4,700 అదే రోజు చెల్లించాలన్నారు.

ముదిగుబ్బ మండల వైసిపి కన్వీనర్‌గా సివి రెడ్డి

ముదిగుబ్బ : మండల వైసిపి నూతన కన్వీనర్‌గా సివి రెడ్డిని నియమిస్తూ పార్టీ అధిష్టానం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. సివి రెడ్డి మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మండల వ్యాప్తంగా ఉన్న ప్రతి ఒక్కరినీ సమన్వయం చేసుకుంటూ నాపై ఉంచిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తానని తెలిపారు.

బండ్లపల్లిలో అంధకారం

ముదిగుబ్బ : మండల పరిధిలోని బండ్లపల్లి గ్రామంలో దాదాపు సగం ఊరి ప్రజలు రాత్రివేళ అంధకారంలో కాలం వెళ్లదీస్తున్నారు. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలో 150కి పైగా నివాసాలు ఉండగా రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. ఇటీవల ఉరుములు, మెరుపుల ధాటికి ఓ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోగా ఆ శాఖ అధికారులు మూడు రోజుల తర్వాత కొత్త ట్రాన్స్‌ఫార్మర్ కేటాయించారు. అయితే కొందరు వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు అడ్డుపడుతుండడంతో గ్రామంలోని సగం ఇళ్లకు విద్యుత్ సరఫరా లేక ఐదు రోజుల నుంచి అంధకారంలో కాలం వెళ్లదీస్తున్నారు.

'నా భూమి- నా దేశం' జయప్రదం చేయండి

ధర్మవరం టౌన్ : పురపాలక సంఘ పరిధిలో శనివారం నిర్వహించనున్న 'నా భూమి- నా దేశం' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలోని 40 వార్డుల నుంచి మట్టిని సేకరించి కలశం(కుండ)లో వేసుకుని మున్సిపల్ కార్యాలయం తేవాలని తెలిపారు. వార్డు సచివాలయంలో పని చేస్తున్న వార్డు అడ్మిన్ సెక్రటరీలచే మట్టిని సేకరించి ఇక్కడికి తేవాలని తెలిపారు.

భూ రీసర్వేని సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-కొత్తచెరువు రూరల్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్న భూరక్ష' సర్వేని ప్రతి రైతూ సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ రామాంజనేయరెడ్డి సూచించారు. ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని కదిరిదేవరపల్లి, బైరాపురం, లింగారెడ్డిపల్లి, లోచర్ల, ఇరగంపల్లి, కొత్తచెరువు, తలమర్ల, మరికుంటపల్లి, బండ్లపల్లి గ్రామాల్లో భూ రీ సర్వే పనులు జరుగుతాయన్నారు. కదిరిదేవరపల్లి గ్రామంలో హద్దురాళ్లను సైతం ఏర్పాటు చేశామని, రీసర్వే పనులకు ప్రతి రైతూ సహకరించాలని, తద్వారా త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు. దీని వల్ల రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లదని, మేలు జరుగుతుందని ఆయన తెలిపారు.

'బత్తల'కు పలువురి జన్మదిన శుభాకాంక్షలు

కదిరి టౌన్ : వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ బత్తల హరిప్రసాద్ జన్మదినం సందర్భంగా శుక్రవారం పలువురు ఆయనకు శుభాకంక్షలు తెలిపారు. కదిరి కుమ్మరవాండ్లపల్లిలోని తన నివాసంలో బత్తల పార్టీ శ్రేణులు, అభిమానుల మధ్య బత్తల కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు దుశ్శాలువాలు, పూల మాలలతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు డాక్టర్ బత్తల వెంకటరమణ, లింగాల లోకేశ్వర్ రెడ్డి, కెఎస్ బహవుద్దీన్, దశరథ నాయుడు, మోహన్‌రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టాయిలెట్ల నిర్మాణానికి భూమిపూజ

పెనుకొండ : పట్టణంలోని ట్యాంకు సర్కిల్‌లో నిర్మల్ ఫౌండేషన్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్, హైదరాబాద్ వారి ద్వారా బిఒటి పద్ధతిపై నగర పంచాయతీ పరిధిలో రెండు పబ్లిక్ టాయిలెట్లను నిర్మించేందుకు శుక్రవారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఉమర్ ఫరూక్, వైస్ ఛైర్మన్ సునీల్, నగర పంచాయతీ కమిషనర్ వంశీ కృష్ణభార్గవ, కౌన్సిలర్లు రఘునాథ్‌రెడ్డి, గణేష్, సద్దాం, శేషాద్రి, యాసిన్, టౌన్ కన్వీనర్ నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో వేగంగా నిర్మాణ పనులు

ఓబులదేవరచెరువు : మండల పరిధిలోని ఆకుతోటపల్లి జగనన్న కాలనీలో హౌసింగ్ నిర్మాణం పనులు వేగవంతం జరుగుతున్నట్లు ఎంపిపి తుమ్మల పర్వీన్ తెలిపారు. కాలనీలో మౌలిక వసతులు, విద్యుత్, ల్యాండ్ లెవెలింగ్, ఇతర పనులను ఎమ్మెల్యే ఆదేశాల మేరకు యుద్ధ ప్రాతిపదికన చేస్తున్నట్లు తెలిపారు. ఎంపిపి వెంట షామీర్‌బాషా, సర్పంచి గోవిందు, వార్డ్ మెంబర్ జానిబాషా, డీలర్ సూరి, జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మల బాబా, గృహ నిర్మాణ లబ్ధిదారులు, తదితరులు ఉన్నారు.

జగనన్న కాలనీలో పనులను పరిశీలిస్తున్న నాయకులు

వైసిపి ప్రభుత్వంతోనే ప్రజా సంక్షేమ పాలన

ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

ప్రజాశక్తి-బుక్కపట్నం

వైసిపి ప్రభుత్వంతోనే ప్రజా సంక్షేమ పాలన సాధ్యమని ఎమ్మెల్యే డి.శ్రీధర్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని గసిగవారిపల్లి గ్రామంలో శుక్రవారం ఆయన కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి పేదవాడు సంక్షేమ పథకాల లబ్ధి పొందుతూ సంతోషంగా ఉన్నారని తెలిపారు. ప్రజా సంక్షేమ పథకాలే రాబోయే ఎన్నికల్లో వైసిపిని గెలిపిస్తాయని తెలిపారు. కార్యకర్తలు, నాయకులు ఇంటింటికీ వెళ్లి వైసిపి ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని తెలిపారు. సమావేశంలో ఎంపిపి శ్రీధర్‌రెడ్డి, జడ్పిటిసి శ్రీలత గోవర్ధన్ రెడ్డి, సర్పంచి గోవిందరెడ్డి, కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

బాల్యవివాహాలపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-రొద్దం

మండల పరిధిలోని శేషాపురం-1 అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సుజాత ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన సదస్సు, సెక్టార్ స్థాయి సమావేశం నిర్వహించారు. సూపర్‌వైజర్ మాట్లాడుతూ పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాల గురించి వివరించారు. మహిళా సంరక్షణ కార్యదర్శి అపర్ణ బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరిచంచారు. 18 ఏళ్ల లోపు బాలికలకు వివాహం చేస్తే రూ. లక్ష జరిమానా, రెండేళ్ల కారగార శిక్ష విధిస్తారని హెచ్చరించారు. సమావేశంలో పంచాయతీ సెక్రటరీ సుధాకర్ రెడ్డి, వెల్ఫేర్ అసిస్టెంట్ నజీర్, అంగన్వాడీ కార్యకర్తలు లక్షిదేవి, వరలక్ష్మి, నాగరత్న , భాగ్య, స్వప్న, సాయిలీల, నందిని, సునీత, అలివేలమ్మ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన సదస్సులో పాల్గొన్న ఐసిడిఎస్ అధికారులు

కదిరి టౌన్ : బాల్య వివాహాలతో జీవితాలు చిన్నాభిన్నమవుతాయని ఐసిడిఎస్ సిడిపిఓ రాధిక తెలిపారు. పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం బాల్య వివాహాలతో కలిగే నష్టాలపై గాండ్లపెంట, ఎన్‌పి కుంట, తలుపుల, కదిరి మండలాల సచివాలయ మహిళా పోలీసులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఇఓ చిన్నకృష్ణ, ఎంపిడిఓ అంజనప్ప, సూపర్‌వైజర్లు, ఐసిడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు

చెరువు స్థలాన్ని కాపాడాలని వినతి

ప్రజాశక్తి-గోరంట్ల

మండల పరిధిలోని రెడ్డిచెరువుకట్ట గ్రామానికి చెందిన చెరువు స్థలాన్ని ఇదే గ్రామానికి చెందిన బాబయ్య కుమారులు నరేష్, గోపాల్, కుమార్ కబ్జా చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం గ్రామస్తులు తహశీల్దార్ రంగనాయకులుకు వినతి పత్రం అందజేశారు. గ్రామస్తులు మాట్లా డుతూ ఆ ముగ్గురూ చెరువు కట్ట మీద ఉన్న చింత చెట్లు తొలగించడం వల్ల కట్ట కోతకు గురవుతుందని, తద్వారా ప్రమాదం జరిగే పరిస్థితి ఉందని తెలిపారు. చెరువు స్థలాన్ని ఆక్రమిస్తూ గ్రామస్తులపైనే దౌర్జన్యం చేస్తున్నారని వాపోయారు. కార్యక్రమంలో గ్రామస్తులు మోహన్‌కుమార్, కృష్ణమూర్తి, శంకరప్ప, నాగరాజు, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు

తహశీల్దార్ రంగనాయకులుకు వినతి పత్రం ఇస్తున్న గ్రామస్తులు

ఎస్సీ కాలనీల్లో సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-మడకశిర

నియోజకవర్గ వ్యాప్తంగా పర్యటించి ఎస్సీ కాలనీల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎం.నరసింహులు తెలిపారు. ఆయన శుక్రవారం ఆర్.అనంతపురం సర్పంచి శివలింగప్పను కలిసి కాలనీలో నెలకొన్నా సమస్యలు, వివిధ అంశాలపై ఆరా తీశారు. 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో భాగంగా సచివాలయానికి మంజూరైన రూ. 20 లక్షలను ఏ పనులకు వినియోగిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. కాంట్రాక్టర్లు ముందుకు రాక చాలా గ్రామాల్లో పనులు జరగడం లేదని ఆయా గ్రామాలో సర్పంచులు తెలిపారు. ఆయన వెంట పబ్లిసిటీ విభాగం జిల్లా అధ్యక్షుడు వెంకటరంగారెడ్డి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు తిప్పేస్వామి, ఉపాధ్యక్షులు నరసింహులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

కరపత్రాలను సర్పంచికి అందజేస్తున్న నరసింహులు

విద్యార్థిని వేదప్రజ్ఞకు నాట్యమయూరి పురస్కారం

ప్రజాశక్తి-గోరంట్ల రూరల్

మండల పరిధిలోని కరావులపల్లి గ్రామానికి చెందిన విద్యార్థిని మైలారం వేదప్రజ్ఞ శుక్రవారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతి ఆడిటోరియంలో నాట్య మయూరి పురస్కారం అందుకుంది. ఆల్ ఇండియా లెవెల్ లో నిర్వహించిన కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల నుంచి ఎందరో విద్యార్థులు, కళాకారులు పాల్గొన్నారు. అందులో వేద ప్రజ్ఞ 'శంభో శివ శంభో' పాటకు నృత్యం చేసి సభికులను ఆకట్టుకుంది. దీంతో వెల్ఫేర్ సొసైటీ వారు ప్రముఖ టీవీ ఆర్టిస్ట్ చింతలపూడి వెంకట్, వేదాంత రాదేష్ శ్యామ్, సినీ తార షేక్ రహానా తస్లీమ్ ద్వారా వేదకు నాట్యమయూరి అవార్డుతో పాటు ప్రశంసా పత్రం అందజేశారు. వేదప్రజ్ఞ ధర్మవరానికి చెందిన బాపు బాలాజీ వద్ద శిక్షణ పొందింది. గుమ్మయగారిపల్లిలో ఉదయ్ కిరణ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 7వ తరగతి చదువుతోంది.

అవార్డు, ప్రశంసా పత్రంతో వేదప్రజ్ఞ

కోర్టు ఆవరణలో స్వచ్ఛత హి సేవ

ప్రజాశక్తి-కదిరి టౌన్

పట్టణంలోని కోర్టు ఆవరణలో శుక్రవారం సీనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి జయలక్ష్మి ఆధ్వర్యంలో స్వచ్ఛత హి సేవ కార్యక్రమం నిర్వహించారు. ఆమె న్యాయవాదులతో కలిసి కోర్టు పరిసరాలను పరిశుభ్రం చేశారు. జయలక్ష్మి మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అపరిశుభ్రత అనేక వ్యాధుల కు కారణమవుతాయని, మంచి పరిసరాలు మంచి ఆలోచనలు కలిగిస్తాయన్నారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు లింగాల లోకేశ్వర్‌రెడ్డి, సీనియర్ న్యాయవాదులు నరసింహులు, ప్రసాద్‌రెడ్డి, పిడుగు రవీంద్రబాబు, గురులింగస్వామి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : పట్టణంలోని కోర్టు ఆవరణలో శుక్రవారం సాయంత్రం సీనియర్ సివిల్ జడ్జి ఎం.శంకర రావు, జూనియర్ సివిల్ జడ్జి ముజీబ్ పసలా సయ్యద్ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కోర్టు ఆవరణలో చీపుర్లతో చెత్తను ఊడ్చి, పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. కార్యక్రమం లో ఎజిపి ఎం.భాస్కర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు డి.నాగరాజు, న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.

కోర్టు ఆవరణలో శుభ్రం చేస్తున్న సిబ్బంది

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

ప్రజాశక్తి-గాండ్లపెంట

స్థానిక జడ్పి హైస్కూల్‌లో శుక్రవారం ఆర్‌డిటి సంస్థ సహకారంతో రీజినల్ డైరెక్టర్ శాంతమ్మ ద్వారా విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశామని ఎటిఎల్ కృష్ణ తెలిపారు. ఆర్‌డి శాంతమ్మ మాట్లాడుతూ విద్యార్థులు గ్రామీణ ప్రాంతాల నుంచి సకాలంలో పాఠశాలకు హాజరుకావాలనే ఉద్దేశంతో 37 సైకిళ్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. డ్రాపౌట్ పిల్లలను బడిలో చేర్పించాలని, నాణ్యమైన విద్యనందించే ఉద్దేశంతోనే ఆర్‌డిటి చేయూత అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రమిదరాణి, ఉపాధ్యాయులు నరసింహుడు, ఆర్‌డిటి సిబ్బంది సిఒలు నారాయణ, అనిత, నవీన్, గంగాద్రి, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేసిన ఆర్‌డిటి అధికారులు

సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి జెసి కార్తీక్

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

ఇన్‌ఛార్జి జెసి కార్తీక్

ప్రజాశక్తి-హిందూపురం

18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్ కార్తీక్ పిలుపునిచ్చారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఆయన వివిధ రాజకీయ పార్టీలతో పోలింగ్ కేంద్రాల మార్పుపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 18 పోలింగ్ కేంద్రాల ప్రదేశాలను మార్పులు చేస్తున్నామన్నారు. హిందూపురం రూరల్‌లో 1, పట్టణంలో 13, లేపాక్షి, చిలమత్తూరులో 2, వీటితో పాటు 16 పోలింగ్ కేంద్రాల పేర్లు మారుస్తున్నామన్నారు. హిందూపురం రూరల్‌లో 2, చిలమత్తూరులో 14 కేంద్రాలు ఉన్నాయని, వీటిని రాజకీయ పార్టీల ప్రతినిధులు ఆమోదించారన్నారు. సమావేశంలో తహశీల్దార్ స్వర్ణలత, లేపాక్షి, చిలమత్తూరు. తహశీల్దార్లు బాబు, నాగరాజు, ఎంపిడిఓ నరేంద్ర, సెరికల్చర్ ఎడి సురేష్, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ రాంభూపాల్ రెడ్డి, ఎన్నికల డిటి రెడ్డిశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే వైసిపి ధ్యేయం

ఎమ్మెల్యే పివి సిద్ధారెడ్డి

ప్రజాశక్తి-కదిరి అర్బన్

అభివృద్ధే ధ్యేయంగా వైసిపి ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే పివి సిద్ధారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలో వెలసిన యర్రదొడ్డి గంగమ్మ దేవస్థానంలో రూ. 1.25 కోట్ల వ్యయంతో చేపట్టిన ఆలయ నిర్మాణానికి శుక్రవారం ఎమ్మెల్యేతో పాటు ఉమ్మడి అనంతపురం జిల్లా జడ్పి ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ శంకుస్థాపన చేయ డంతో పాటు శిలాఫలకాన్ని ఆవిష్కరించి భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే సిఎం జగన్ సహకారంతో సిజిఎఫ్ నిధులు రూ. 1 కోటి, దేవస్థానం నిధులు రూ. 25 లక్షలతో ఆలయ నిర్మాణం చేపట్టామన్నారు. వైసిపి అధికారం చేపట్టిన తర్వాత ఈ ఆలయాన్ని దేవాదాయ ధర్మాదాయ శాఖలో చేర్చామన్నారు. కార్యక్రమంలో ఎంపిపిలు, అమరనాథ్‌రెడ్డి, కార్య నిర్వహణ అధికారి, జడ్పిటిసిలు, వైస్ ఎంపిపిలు, కో ఆప్షన్ సభ్యులు, ఎంపిటిసిలు, సర్పంచులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

1న కొత్తచెరువుకు కలెక్టర్ రాక

ప్రజాశక్తి-కొత్తచెరువు

అక్టోబర్ 1వ తేదీ కొత్తచెరువులో చేపట్టనున్న 'స్వచ్ఛత హి సేవ' కార్యక్రమంలో కలెక్టర్ పి.అరుణ్‌బాబు పాల్గొంటారని పుట్టపర్తి ఇన్‌ఛార్జి డిఎల్‌పిఓ శివకుమారి, ఇఓఆర్‌డి సిద్ధారెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటలకు ఎంపిడిఓ కార్యాలయం నుంచి గ్రామంలోని వీధుల్లో తిరిగి ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. కొత్తచెరువు, బండ్లపల్లి, బైరాపురం, లోచర్ల గ్రామాల్లో పర్యటించి ఆయా సచివాలయాలను సందర్శిస్తారన్నారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు ఆ రోజు గ్రామాల్లో పారిశుధ్యం కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో కార్యదర్శులు సుధాకర్, శ్రవణ్, తదితరులు పాల్గొన్నారు.

ఓబులేసు(ఫైల్‌ఫొటో) మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న రూరల్ సిఐ, సిబ్బంది

ప్రభుత్వ లాంఛనాలతో హెడ్ కానిస్టేబుల్ అంత్యక్రియలు

ప్రజాశక్తి-బత్తలపల్లి

అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న హెడ్ కానిస్టేబుల్ ఓబులేసు శుక్రవారం మృతి చెందాడు. స్థానిక స్టేషన్‌లో మూడున్నరేళ్లగా హెచ్‌సిగా విధులు నిర్వహిస్తున్న బి.ఓబిలేసు(55) పక్షవాతంతో బాధ పడేవాడు. సెలవు పెట్టి చికిత్స పొందుతున్న సమయంలో నెల రోజుల కిందట బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో కర్నూలు ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. విషయం తెలిసిన వెంటనే ధర్మవరం రూరల్ సిఐ ఆరోహణరావు, ఎఎస్ఐ సోమశేఖర్‌మూర్తి, బత్తలపల్లి పోలీస్ సిబ్బంది, జిల్లా యూనియన్ నాయకులు అనంతపురం వెళ్లి ఓబులేసు భౌతిక కాయం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతపురంలోని క్రిస్టియన్ పరేడ్ గ్రౌండ్‌లో శుక్రవారం ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ప్రభుత్వం తక్షణ సాయంగా రూ. 25 వేలను ఆయన కుటుంబ సభ్యులకు అందజేశారు.

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో పెయింటర్ మృతి

ధర్మవరం టౌన్ : విద్యుదాఘాతంతో ఓ పెయింటర్ మృతిచెందిన సంఘటన శుక్రవారం పట్టణంలోని రాజేంద్రనగర్‌లో జరిగింది. టూ టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు.. దుర్గానగర్‌కు చెందిన వెంకటేశ్(50) పెయింటర్ పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. రాజేంద్రనగర్‌లో పెయింటింగ్ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తూ విద్యుత్ వైర్లు తాకడంతో షాక్‌కు గురవడంతో తోటి పెయింటర్ వెంకటేష్ వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఇతడి భార్య 20 ఏళ్ల క్రితమే వదిలేసింది. దీంతో అతడు తల్లి వెంకటమ్మ వద్దనే ఉంటున్నాడు.

మృతిచెందిన వెంకటేశ్

యువకునిపై దుండగుల హత్యాయత్నం

బత్తలపల్లి : ద్విచక్ర వాహనంపై వెళున్న ఓ యువకుడిపై మరో బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన శుక్రవారం మండల పరిధిలోని జ్వాలాపురం క్రాస్ వద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. ధర్మవరం పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన లక్ష్మీనారాయణ కుమారుడు నగేష్ కియాలో పని చేస్తుండేవాడు. కొన్ని రోజులుగా ఉద్యోగం వదిలేసి ఇంటి వద్దే ఉంటున్నాడు. ముదిగుబ్బ మండలంలోని మర్తాడు గ్రామానికి చెందిన ఆదినారాయణ కుమార్తె మౌనికతో వివాహం జరిగింది. ఆమె గర్భవతి కావడంతో ద్విచక్ర వాహనంపై మర్తాడు వెళ్లి తిరిగి ధర్మవరం వస్తుండగా జ్వాలాపురం క్రాస్ వద్దకు రాగానే హెల్మెట్ ధరించిన ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి నగేష్‌ను ఆపి కత్తితో దాడి చేసి పరారయ్యారు. సమాచారం అందుకున్న ఎఎస్ఐ సోమశేఖరమూర్తి కానిస్టేబుల్ పెద్దారెడ్డి, నారాయణస్వామిలను సంఘటనా స్థలానికి పంపించగా వారు నగేష్‌ను ఆసుపత్రికి తరలించారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నగేష్

'జగనన్న కాలనీ'లో ట్రాన్స్‌ఫార్మర్ చోరీ

లేపాక్షి : మండల పరిధిలోని కల్లూరు గ్రామానికి చెందిన 'జగనన్న కాలనీ'లో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పగలగొట్టి అందులోని కాపర్ వైరును ఎత్తుకెళ్లినట్లు ఎఇ వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తెలిపారు. వాటి విలువ రూ. 4 లక్షలు ఉంటుందన్నారున. గతంలో కొండూరు జగనన్న లే అవుట్‌లో వైరు చోరీకి గురైందన్నారు.

డ్రిప్ పైపులు చోరీ

మడకశిర : మండల పరిధిలోని భీమరాయనపల్లి గ్రామానికి చెందిన ఉప్పర వెంకటేష్ పొలంలో గురువా రం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రూ. లక్ష విలువ చేసే డ్రిప్ పైపులు ఎత్తుకెళ్లారు. పంటలను దక్కించుకోవా లనే ఉద్దేశంతో అప్పు చేసి డ్రిప్ పైపులు కొనుగోలు చేయగా దొంగలు ఎత్తుకెళ్లడంతో తీవ్రంగా నష్టపోయాయని, పంటలు కూడా ఎండిపోతాయని బాధిత రైతు వాపోయాడు.

కర్నాటక మద్యం స్వాధీనం

గోరంట్ల రూరల్ : కర్నాటక ప్రాంతం నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి మద్యం స్వాధీనం చేసుకున్నట్లు సిఐ సుబ్బరాయుడు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం 1 గంట సమయంలో గోరంట్ల మండలంలోని ఎం.కొత్తపల్లి క్రాస్ సమీపంలో కళ్లగేరి గ్రామానికి చెందిన నాగరాజు కర్నాటక నుంచి ద్విచక్ర వాహనంపై టెట్రా ప్యాకెట్లను తరలిస్తుండగా అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి పెనుకొండ కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

పొట్టేళ్లపైకి దూసుకెళ్లిన స్కూల్ బస్సు

ధర్మవరం టౌన్ : పట్టణంలోని గుట్టకిందపల్లి వద్ద మేతకు వెళ్తున్న పొట్టేళ్లపై శుక్రవారం ఓ ప్రయివేటు స్కూల్ బస్సు దూసుకెళ్లడంతో మూడు పొట్టేళ్లు అక్కడికక్కడే మృతిచెందగా, మరో రెండు తీవ్రంగా గాయపడ్డాయి. బాధిత గొర్రెల కాపరి తలారి నరేశ్ తెలిపిన వివరాల మేరకు.. మేతకోసం తనకున్న ఐదు పొట్టేళ్లను తీసుకెళ్తుండగా ఓ ప్రయివేటు స్కూల్ బస్సు దూసుకెళ్లడంతో మూడు మృతి చెందగా మరో రెండింటికి కాళ్లు విరిగాయని తద్వారా దాదాపు రూ. లక్ష నష్టం వాటిల్లినట్టు వాపోయాడు.

విద్యార్థినులకు బైజూస్ ట్యాబ్స్‌పై అవగాహన కల్పిస్తున్న ఎంఇఒలు

బైజూస్ ట్యాబ్స్‌ను సద్వినియోగం చేసుకోండి

ధర్మవరం టౌన్ : ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు బైజూస్ క్యాప్స్ సద్వినియోగం చేసుకోవాలని ఎంఇఒలు గోపాల్‌నాయక్, రాజేశ్వరీదేవి సూచించారున. స్థానిక సంజయ్ నగర్ మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు బైజూస్ ట్యాబ్స్‌పై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ మండలంలో 1748 మంది 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్స్ ఇచ్చామన్నారు. ఈ ట్యాబ్స్‌లో ఎలాంటి అనవసర యాప్‌లు అప్‌లోడ్ చేయరాదని మున్సిపల్ పరిధిలోని నెట్ సెంటర్స్, మొబైల్ మరమ్మతుల షాపుల నిర్వాహకులకు హెచ్చరికలు జారీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

స్వామినాథన్‌కు నివాళి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ప్రఖ్యాత శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ మృతి నేపథ్యంలో శుక్రవారం రైతుసంఘం ఆధ్వర్యంలో సిపిఎం, సిఐటియు నాయకులు స్థానిక కళాజ్యోతి సర్కిల్‌లోని అంబేద్కర్ విగ్రహం ఎదుట ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న మాట్లాడుతూ స్వామినాథన్ సిఫారసులు రైతు పోరాటాల్లో ఇప్పటికీ ముఖ్యమైన అంశంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు ఎస్‌హెచ్ బాషా, వెంకటస్వామి, రైతు సంఘం నాయకులు బడన్నపల్లి బాబు, సిఐటియు నాయకులు సుబ్రమణ్యం, కుళ్లాయప్ప, నారాయణస్వామి, చక్రపాణి, సత్తి, ఖాజీ, వెంకటేశ్, చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

స్వామినాథన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రైతుసంఘం, సిపిఎం, సిఐటియు నాయకులు

'జగనన్న ఆరోగ్య సురక్ష' ఏర్పాట్ల పరిశీలన

బత్తలపల్లి : మండల పరిధిలోని అప్పరాచెరువు సచివాలయ ప్రాంగణంలో శనివారం(నేడు) చేపట్టనున్న 'జగనన్న ఆరోగ్య సురక్ష' ఏర్పాట్లను శుక్రవారం ఎంపిడిఓ సౌజన్యకుమారి, ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ గంగిరెడ్డి, ఇఓఆర్‌డి దివాకర్, ఎంపిపి బగ్గిరి త్రివేణిరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ బగ్గిరి భయపరెడ్డి, సర్పంచి శారదమ్మ పర్యవేక్షించారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలు అందించడానికి చర్యలు చేపట్టిందని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అలివేలు మంగమ్మ, హెచ్‌ఎం ప్రమిద, తదితరులు పాల్గొన్నారు.

నేడు బండ్లపల్లిలో 'జగనన్న ఆరోగ్య సురక్ష'

కొత్తచెరువు : మండల పరిధిలోని బండ్లపల్లి గ్రామ సచివాలయంలో శనివారం 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ బరాన్‌సాబ్, తహశీల్దార్ రామాంజనేయరెడ్డి తెలిపారు. ఇందులో డాక్టర్ కె.మమత, వైద్య సిబ్బంది సేవలు అందిస్తారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వైసిపి కన్వీనర్లకు సన్మానం

హిందూపురం : హిందూపురం పట్టణ కన్వీనర్లుగా నియమితులైన సిపిసి సాధిక్, వాల్మికి నరేష్‌లను శుక్రవారం ఇన్‌ఛార్జి దీపిక వేణురెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ ఛైర్మన్లు జబివుల్లా, బలరామిరెడ్డితో పాటు నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. నూతన కన్వీనర్లు మాట్లాడుతూ ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గంలో వైసిపి గెలుపే లక్ష్యంగా పని చేస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజశ్రీ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, కదిరి.

I.A.No.168/2021 in O.S. No.614/2021

Between:-

Sanamsetty Nagesh and 3 others ...Plaintiffs

Vs

M.Sreenivasulu Naik and 11 others ...Defendants

To,

1) **Defendant No.1:** ఎం.శ్రీనివాసులు నాయక్, S/o. లాలేనాయక్, వయస్సు 44సంవత్సరాలు. హిందూ, డోర్ నెంబర్ 4-32, మొగలిచెట్ల తండా, తవళం పంచాయితి, తనకల్లు మండలం, శ్రీసత్యసాయి జిల్లా.

2) **Defendant No.3:** ఎం.బాబు నాయక్, S/o. లాలేనాయక్, వయస్సు 56 సంవత్సరాలు, హిందూ డోర్ నెంబర్ 4-32-బి, మొగలిచెట్లతండా, తవళం పంచాయితి, తనకల్లు మండలం, శ్రీసత్యసాయి జిల్లా.

1మరియు 3వ ప్రతివాదులకు కోర్టు నోటీసులు

పై దావాలో వాదులు మీపై పర్మనేట్ ఇన్‌జక్షన్ కోసం దావా వేసి ఉన్నారు. ఈ దావాలో మిమ్ములను ప్రతివాదులుగా చేర్చడమైనది. మీ హాజరు నిమిత్తం పై కోర్టులో 16-10-2023వ తేదీన వాయిదా వేసి ఉన్నారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేదా మీ వకీలు ద్వారా కానీ కోర్టులో హాజరై ఆక్షేపణలు ఉన్న యెడల కోర్టు వారికి తెలుపుకోవాలని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది: 16-10-2023

కె. నాగేంద్ర రెడ్డి, B.A., B.L. అడ్వకేట్, కదిరి.

రాజశ్రీ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, కదిరి

I.A.No.88/2021 in O.S.No.390/2021

Between:

1. Malaka Bhagyamma
2. Dademi Ranga Reddy ...Plaintiffs

And

1. Yanga Reddy Madhusudhan Reddy,
2. Bommireddy Amarnath Reddy ....Defendants

To

Defendant No.2: బొమ్మిరెడ్డి అమర్నాథ్ రెడ్డి, S/o బి.సదాశివ రెడ్డి, వయస్సు 48సంవత్సరాలు, హిందూ, డోర్ నెంబర్2-2, చిన్నరామన్న గారి పల్లి గ్రామం మరియు పోస్టు, తనకల్లు మండలం, శ్రీసత్యసాయి జిల్లా.

2వ ప్రతివాదికి కోర్టు నోటీసులు

పై దావాలో వాదులు నీ పై విక్రయ దస్తావేజు రద్దుకోసం దావా వేసి ఉన్నారు. ఈ దావాలో నిన్ను 2వ ప్రతివాదిగా చేర్చడమైనది. నీ హాజరు నిమిత్తం పై కోర్టులో 19-10-2023 తేదీన వాయిదా వేసి ఉన్నారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేదా మీ వకీలు ద్వారా కానీ కోర్టులో హాజరై ఆక్షేపణలు ఉన్న యెడల కోర్టు వారికి తెలుపుకోవాలని ఇందు మూలంగా తెలియజేయడమైనది.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)

ఇట్లు :

కె. నాగేంద్ర రెడ్డి, B.A., B.L. (వాది తరపు న్యాయవాది) అడ్వకేట్, కదిరి.

వాయిదా తేది: 19-10-2023

నారా భువనేశ్వరిని కలిసిన ధర్మవరం తెలుగు యువత నాయకులు

నారా భువనేశ్వరిని కలిసిన ధర్మవరం నాయకులు

ధర్మవరంటౌన్ : టిడిపి అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరిని శుక్రవారం నియోజకవర్గ అధికార ప్రతినిధి అమర సుధాకర్‌నాయుడు, నాయకులు గడుపూటి శంకర్, గడుపూటి జయంత్ రాజమండ్రిలో కలిశారు. నియోజకవర్గంలో పార్టీ గెలుపు కోసం పరిటాల శ్రీరామ్ ఆధ్వర్యంలో సైనికుల్లా పని చేయడంతో పాటు చంద్రబాబు అక్రమ అరెస్టు గురించి క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆమె సూచించారని వారు తెలిపారు.

వైసిపి నుంచి టిడిపిలో చేరిక

మడకశిర : రొళ్ల మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన వైసిపి నాయకులు శుక్రవారం ఆ పార్టీని వీడి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి సమక్షంలో టిడిపిలో చేరారు. కొత్తపల్లి చంద్రప్ప, కాకి గ్రామానికి చెందిన మంజునాథ్, ఆర్.గొల్లహట్టి చిక్కన్న, తదితర 30 కుటుంబాలు వైసిపికి రాజీనామా చేసి టిడిపిలో చేరగా గుండుమల పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, గురుమూర్తి, మండల కన్వీనర్ దాసిరెడ్డి, సన్నతిమ్మప్ప, ప్రధాన కార్యదర్శి ఈరన్న, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

హైదర్‌వలికి సన్మానం

ముదిగుబ్బ : స్థానిక గేట్ కొట్టాల మసీదు పెద్దలు, ముతవల్లి నూర్ మహమ్మద్ శుక్రవారం హైదర్‌వలిని ఘనంగా సన్మానించారు. రాష్ట్ర నూర్‌బాషా దూదేకుల సంఘం ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కోడెకంటి హైదర్‌వలి ఎన్నిక కావడంతో గేట్ కొట్టాల మదీన మసీదు మతపెద్దలు, ముస్లింలు హైదర్‌వలిని అభినందించారు.

దేశం గొప్పతనాన్ని చాటుదాం

రొద్దం : భారతదేశం గొప్పతనాన్ని చాటుదామని ఎంపిపి చంద్రశేఖర్ పేర్కొన్నారు. మండల పరిధిలోని కెజిబివి లో శుక్రవారం నిర్వహించిన 'హమారా మట్టి-హమారా దేశ్' కార్యక్రమంలో ఎంపిపి పాల్గొని మాట్లాడారు. ముందుగా దేశ నాయకుల చిత్ర పటాలతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ నాగరత్నమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

పంటనమోదు పరిశీలన

ఓబుళదేవరచెరువు : మండల పరిధిలోని తిప్పేపల్లి, డబ్బురువారిపల్లి గ్రామాల్లో చేపట్టిన పంట నమోదు ప్రక్రియను శుక్రవారం కదిరి వ్యవసాయ శాఖ ఎడి సత్యనారాయణ, ఎఒ ఇలియాజ్ అహ్మద్ పరిశీలించారు. వారు మాట్లాడుతూ పంట నమోదు చేసుకున్న ప్రతి రైతూ తప్పనిసరిగా ఇకెవైసి చేయించాలని సూచించారున. అనంతరం డబ్బురువారిపల్లిలో సర్వే నెంబర్-523 జగన్నాథ్ రెడ్డి పొలంలో వేరుశెనగ పంటకోత ప్రయోగాన్ని పరిశీలించారు. వారి వెంట పవన్ కుమార్, శ్రావణి, తదితరులు ఉన్నారు.

అండగా ఉంటాం.. అధైర్య పడకండి

హిందూపురం : పట్టణంలో ఇటీవల వినాయక నిమజ్జనం సందర్భంగా చోటుచేసుకున్న పరిణామాలపై శుక్రవారం జామి యా మసీదు ముతవల్లి, కమిటీ నిర్వాహకులు వైసిపి ఇన్‌ఛార్జి వేణురెడ్డితో వైసిపి కార్యాలయంలో చర్చించారు. ఈ సందర్భంగా అన్ని విషయాలను సమగ్రంగా చర్చించారు. దీనిపై స్పందించిన వేణురెడ్డి ఎవరూ అధైర్య పడవద్దు అందరికీ న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో జామీయా మసీదు ముతవల్లి నూరుల్లా, కమిటీ నిర్వాహకులు, నాయకులు మార్కెట్ చాంద్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

కుక్కలు పట్టివేత

హిందూపురం : మున్సిపాలిటీ వ్యాప్తంగా శుక్రవారం శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్ ఆధ్వర్యంలో 13వ వార్డులో ఊర కుక్కలను పట్టారు. ఆయన మాట్లాడుతూ కొంత కాలంగా పట్టణంలో కుక్కలు ఎక్కువగా కరుస్తున్నట్లు ప్రజల నుంచి ఫిర్యాదులు అందడంతో మున్సిపల్ కమిషనర్ ప్రత్యేక చర్యలు చేపట్టారన్నారు. పట్టిన కుక్కలను ప్రత్యేక వాహనంలో సుదూర ప్రాంతాలకు తీసుకెళ్లి వదులుతామన్నారు.

పెనుకొండలో కళ్లకు నల్ల రిబ్బన్ కట్టుకుని నిరసన తెలుపుతున్న బికె పార్థసారథి, టిడిపి నాయకులు, పుట్టపర్తిలో డప్పు కొడుతున్న పల్లెతోపాటు పార్టీ శ్రేణులు

రాష్ట్రంలో నియంత పాలన

టిడిపి జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారథి

ప్రజాశక్తి -పెనుకొండ

ఒక్క ఛాన్స్ అని ప్రజలను వేడుకుని అధికారం లోకి వచ్చిన సిఎం జగన్ రాష్ట్రంలో నియంత పాలన కొనసాగిస్తున్నారని టిడిఇపి జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారథి పేర్కొన్నారు. టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టుకి నిరసనగా చేపట్టిన సామూహిక రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్‌లో పార్థసారథి ఆధ్వర్యంలో కళ్లకు నల్ల రిబ్బన్‌తో గంతులు కట్టుకొని దీక్షలో పాల్గొన్నారు. పార్థసారథి మాట్లాడుతూ సిపిఎస్‌పై అవగాహన లేక హామీ ఇచ్చానని చెప్పిన తుగ్లక్ సిఎం మనల్ని పరిపాలిస్తున్నాడని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో నాయకులు చిన్న వెంకటరాముడు, కేశవయ్య, జివిపి నాయు డు, రొద్దం నరసింహులు, చిన్నప్ప య్య, సుబ్బరత్నమ్మ, భానుకీర్తిస్వామి, రామలింగ, రఘువీర, సిద్ధయ్య, అనసూ యమ్మ, చంద్రకాంతమ్మ, రవిశంకర్, కన్నా స్వామి, పోతిరెడ్డి, శ్రీనివాసులు, నరేంద్ర, రమేష్‌నా యుడు, రియాజ్, ఆంజనేయులు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

డప్పు కొట్టి నిరసన తెలిపిన పల్లె

పుట్టపర్తి అర్బన్ : చంద్రబాబు అరెస్టుపై మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి ఆ పార్టీ శ్రేణులు డప్పు కొట్టి నిరసన తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయం ముందు చేపట్టిన రిలే నిరాహార దీక్షలో పల్లె మాట్లాడుతూ చంద్రబాబును విడుదల చేసేంతవరకూ పోరాటం ఆగదని అవసరమైతే మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దీక్షలో జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ కన్వీనర్ రామాంజనేయులు, మైనార్టీ నాయకుడు మహమ్మద్‌రఫీ, జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, గూడూరు ఓబులేసు, ఎల్‌ఐసి నరసింహులు, బొమ్మయ్య, ఆవుల సుబ్రహ్మణ్యం, యశోద, మాధవి తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం : పట్టణంలో మాజీ ఎమ్మెల్యే మద్దనకుంట ఈరన్న ఆధ్వర్యంలో సామూహిక రిలే నిరాహార దీక్ష చేపట్టారు. వారు మాట్లాడుతూ మా నాయకుడు విడుదల అయ్యేంత వరకూ పోరాటాలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. రాబోయే ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి రావడం తథ్యమన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకుడు ఉగ్రనరసింహా, ఆదినారాయణ, ఒక్కలిగ కార్పొరేషన్ డైరెక్టర్ పాండురంగప్ప, బిఎల్‌అర్ వీరకేతరాయ, తమడేపల్లి హనుమంతరయ, నాగభూషణ, పవిత్ర, డాక్టర్ సునీల్, కెంచప్ప, ప్రకాష్, తిమ్మేగౌగ్, లింగరాజు, కేతప్ప, తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : చంద్రబాబు, నారా లోకేష్ పర్యటనలకు ప్రజల నుంచి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక సిఎం జగన్ అక్రమంగా అరెస్టు చేయించారని టిడిపి నాయకులు విమర్శించారు. మండల పరిధిలోని మాల్యవంతం, ఈదుల ముష్టూరు, సంజీవపురం పంచాయతీల్లో గ్రామాల్లో బాబుతోనే నేను కార్యక్రమం చేపట్టారు. నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలు, అరాచకపాలనపై కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గోనుగుంట్ల నారాయణరెడ్డి, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు చల్లా శ్రీనివాసనాయుడు, సురేంద్రనాయుడు, నెట్టెం రమణ, సంగాల సూరి, జక్కంపూడి నాగభూషణ, అయ్యప్ప, ప్రభాకర్‌రెడ్డి, కేశవరెడ్డి, తాళ్లూరి సతీష్‌కుమార్ చౌదరి, జొన్నలగడ్డ రంగానాయుడు, చంద్రశేఖర్, బోయపాటి రాము, చిట్ర నాగభూషణ, నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : సైకో జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం రావణకాష్టంలా మారిందని టిడిపి నాయకులు పేర్కొన్నారు. చంద్రబాబు అరెస్టును వ్యతిరేకిస్తూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన సామూహిక రిలే నిరాహార దీక్షలు 17వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో నాయకులు భీమనేని ప్రసాద్‌నాయుడు, గోసల శ్రీరాములు, కేతినేని రాజ, రామకృష్ణ, నాగేంద్ర, వీరయ్య, ఎన్‌బికె హరి, సత్యనారాయణ పాల్గొన్నారు. ప్రతిపక్ష నాయకులను కటకటాలపాలు చేయడమే ధ్యేయంగా సిఎం జగన్ పాలన సాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ముదిగుబ్బ : చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ పట్టణంలోని నాలుగు వార్డుల్లో టిడిపి ఆధ్వర్యంలో నాయకులు 'బాబుతో మేము' కార్యక్రమం నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు. చంద్రబాబుకు మద్దతుగా 92612 92612 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వాలని ఇంటింటికీ వెళ్లి ప్రజలకు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు తుమ్మల మనోహర్, రామ్మూర్తి, రంగనాయకులు, బాసినేని లక్ష్మీనారాయణ, చికెన్ తిరుపాలు, గంగిరెడ్డిపల్లి నాయుడు, ఉత్తమనాయుడు, గడ్డం మోహన్, సూర్యనారాయణ, రియాజ్, ప్రతాప్, అనిల్, అబ్దుల్లా, కృష్ణా, తదితరులు పాల్గొన్నారు.

మడకశిర : 'మేము సైతం బాబు కోసం' కార్యక్రమంలో భాగంగా రొళ్ల మండల పరిధిలోని కొత్తపల్లి, కాకి గ్రామాల్లో టిడిపి ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ చంద్రబాబు కడిగిన ఆణిముత్యంలా బయటకు వస్తారు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎవరూ అధైర్యపడొద్దని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, టిఎన్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి గురుమూర్తి, మండల కన్వీనర్ దాసిరెడ్డి, సన్నతిమ్మప్ప, ప్రధాన కార్యదర్శి ఈరన్న, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు బాలకష్ణ, నియోజకవర్గ ట్రైనర్ రామకృష్ణ, భరత్, కృష్టప్ప, పాండురంగప్ప, సిద్ధగంగప్ప, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టును ఖండిస్తూ శిరో ముండనం

హిందూపురం : చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేశారని ఆరోపిస్తూ టిడిపి ఆధ్వర్యంలో 16 రోజులుగా టిడిపి, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో స్థానిక ఎల్‌జి బాలకృష్ణన్ సర్కిల్‌లో దీక్షలు చేపట్టారు. ఇందులో భాగంగా కొందరు టిడిపి నాయకులు శిరో ముండనం చేసుకుని దీక్షల్లో పాల్గొన్నారు. అంబికా లక్ష్మినారయణ, రమేష్ కుమార్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైసిపిని ఓడించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. చంద్రబాబు విడుదల అయ్యే వరకూ శాంతియుతంగా నిరసన పోరాటాలను కొనసాగిస్తామన్నారు. దీక్షలో నాయకులు జెపికె రాము, అంజనప్ప, రాఘవేంద్ర, సతీష్‌కుమార్, మంగేష్, అమర్‌నాథ్, తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : బిసిల పక్షపాతి పార్టీ టిడిపినేనని నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకట ప్రసాద్ పేర్కొన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద కదిరి నియోజకవర్గ వడ్డెర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టగా భవన నిర్మాణ కార్మికుల సంఘం నాయకులు సంఘీభావం తెలిపారు.

ముదిగుబ్బ : చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ తెలుగు యువత ఆధ్వర్యంలో కాగడాలతో ర్యాలీ నిర్వహించారు, స్థానిక కదిరి రోడ్డులోని పెట్రోల్ బంకు వద్ద నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకూ కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తెలుగు యువత మండల అధ్యక్షుడు సోమల వినోద్ బాబు, అశోక్, ప్రతాప్, రాజేష్, గంగాద్రి, శీను, రవి, హరి, సాంబశివనాయక్, భార్గవ, రామంజి, కార్యకర్తలు పాల్గొన్నారు.

బత్తలపల్లి మండలంలో ఇంటింటికీ టిడిపి నాయకుల ప్రచారం, మదిగుబ్బలో కాగడాల ప్రదర్శన, మడకశిరలో ఇంటింటికీ టిడిపి కార్యక్రమంలో పాల్గొన్న గుండుమల తిప్పేస్వామి

ఉపాధ్యాయునికి ఘనంగా వీడ్కోలు

ప్రజాశక్తి-లేపాక్షి

స్థానిక ఎంజెపి గురుకుల పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న వివేకానందరెడ్డి ఉద్యోగ విరమణ పొందడంతో శుక్రవారం పాఠశాల ఆవరణలో ప్రిన్సిపల్ ప్రసాద్ అధ్యక్షతన వివేకానందరెడ్డి దంపతుల ను ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ వివేకానందరెడ్డి సేవలను కొనియాడారు. అనంతరం దంపతులను గజమాలతో సత్కరించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ మురళీధర్, సుందర్‌రాజు, ఉపాధ్యాయులు షరీఫ్, కరుణజ్యోతి, నరహరి, చంద్ర, రాజేష్, పాఠశాల కమిటీ అధ్యక్షుడు రామంజి, నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వివేకానందరెడ్డి దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

గుండెజబ్బులపై జాగ్రత్తలు అవసరం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

గుండె జబ్బుల పట్ల అజాగ్రత్త వహించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పందన వైద్యులు సోనియా, బషీర్ సూచించారు. ప్రపంచ గుండెపోటు దినోత్సవం సందర్భంగా శుక్రవారం గుండె జబ్బులపై అవగాహన కల్పిస్తూ ఆసుపత్రి ఆవరణలో కరపత్రాలను విడుదల చేశారు. వైద్యులు మాట్లాడుతూ గుండెజబ్బులపై ప్రజలకు ఎంత అవగాహన పెరిగితే అంత జాగ్రత్తలు తీసుకుని కాపాడుకుంటారన్నారు. పుట్టుకతో వచ్చే గుండెజబ్బులు, కండరాలకు వచ్చే జబ్బుల లక్షణాలు, కారణాలు, చికిత్స, నివారణ గురించి వివరించారు. కార్యక్రమంలో డాక్టర్లు పావని, జ్యోతి, సతీశ్, బిందు, గాంగీ, మేనేజర్ బాబా, దిల్దార్ పాల్గొన్నారు.